
# ఎంపిక

- కె.కె.భాగ్యశ్రీ



**నితీష్ సంగీతను పెళ్లిచేసుకోనని చెప్పగానే నాకేమంతఆశ్చర్యంగా అనిపించలేదు.**

**పిల్లలు పుట్టీపుట్టగానే మూతికి ముళ్లువేసి, సంబంధాలు కలిపే సంప్రదాయాలు మనవి. ఎదిగిన పిల్లలు ప్రతిపాదనలను త్రోసిరాజని, వారికిష్టమైన వారిని చేసుకోవడమూ అతి సహజమైన ప్రక్రియ.**

కానీ... నితీష్ మేనరికాన్ని నిరాకరించడం వెనుక ఈ కారణాలేమీ లేవు. వాడు సంగీతను కాదనడానికి వినిపించిన కారణం ఎవరూ ఊహించనిది.

అప్పుడు మాత్రం నాకు అంతులేని ఆశ్చర్యం కలిగింది.

"ఏంటీ నితీష్...నీ దృష్టిలో ఇదొక పెద్ద లోపమా!" నిలదీసింది నా శ్రీమతి సుజాత.

"ఖచ్చితంగా" నితీష్ స్వరంలో స్థిరత్వం.

"ఇదే కారణమని బయటకు చెప్తే నలుగురూ నవ్విపోతారు. ఏకన్నొంకరో- కాలొంకరో, లేక కట్నం సరిపోలేదనో... సాకులు పెట్టి సంబంధం వదులుకుంటే ఎవరూ ఏమీఅనుకోరు. కానీ... ఈ విధంగా..." సుజాత స్వరం రుద్ధమైంది.

మేనరికం చేసుకొని, పుట్టింట్లో తన స్థానాన్ని పదిలపరుచుకుందామన్న స్వార్థం ఆమెది. అందుకే... కొడుకు వాదనను సమర్థించలేకపోతోంది.

నితీష్ ఏం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్లుగా నొసలు ముడివేసి వీధి గుమ్మంవైపు చూస్తూ ఉండిపోయాడు.

వాడు కిమ్మనకుండా ఉండిపోవడంతో ఒళ్లు మండిన నేను "మీ అమ్మ ఏదో అడుగుతోందిగా... సమాధానం చెప్పు" అన్నాను గట్టిగా.

నావైపు ఓసారి చూసి "సంగీతకు ఏ అవకరం ఉన్నా, కట్నకానుకలు అస్సలు ఇవ్వకపోయినా నేను పట్టించుకొనే వాడిని కాను. నిరభ్యంతరంగా ఆమెను చేసుకొనే వాడిని. కాని... ఆమెకు మనసు వంకర. బొత్తిగా మానవత్వం లేని మనిషి. అందుకే వద్దంటున్నాను" చెప్పాడు నితీష్ సూటిగా.

సుజాత దూకుడుగా వాడి ముందుకు వెళ్లి "దానికి మానవత్వం లేదని నువ్వెలా తీర్మానించగలవు?" అడిగింది తీవ్రంగా.

ఆమె ఆవేశానికి చలించనట్లుగా "నాలుగురోజుల క్రితం జరిగిన విషయం గుర్తుచేసుకోండి..." చెప్పాడు నితీష్ నిబ్బరంగా.

అయోమయంగా చూస్తూ "ఏ విషయం?" అడిగింది సుజాత.

"అదే... ఆ బిచ్చగత్తె... పిల్లాడికి పాలులేవని అడుక్కుంటూంటే..." గుర్తుచేసే ప్రయత్నం చేశాడు నితీష్.

అప్పుడు వెలిగింది ట్యూబ్‌లైట్. అవును... నాలుగురోజుల క్రితం అదే ఊర్లో ఉంటున్న నా బావమరిది భార్య సుమతి, తన కూతురు సంగీతను తీసుకొని మా ఇంటికొచ్చింది. చిన్నప్పటినుండీ సంగీతను మా కోడలిగా భావించడంవలన, తను మా ఇంటికి స్వతంత్రంగా వచ్చిపోతూ ఉంటుంది.

మధ్యాహ్నం భోజనాలైనాక గాలికోసం, ఇంటి ముంగిట్లో ఉన్న మామిడి చెట్టుక్రింద కూర్చున్నాం అందరం.

ఎండ మండిపోతోంది. ఆ సమయంలో ఓ బిచ్చగత్తె, చంకలో పసి బిడ్డను వేసుకొని ఇల్లిల్లూ తిరిగి అడుక్కుంటోంది. ఆమె చంకలో ఉన్నవాడి వయసు రెండేళ్లుంటుంది. సరైన పోషణ లేకపోవడం నుండి ఈనుపుల్లలా, అతి బలహీనంగా ఉన్నాడు.

పిల్లవాడికి రెండురోజులుగా తిండి లేదని, కనీసం పాలు కొనడానికైనా పైసలు లేవని, దయగల మారాజులని దానం చేయమంటూ దీనంగా అభ్యర్థిస్తోంది.

"ఛీ...ఛీ... చూడు ఎలా అడుక్కుంటోందో. పిల్లాడిని అద్దెకు తీసుకొచ్చి నాటకం ఆడుతోంది." ఆమెను అసహ్యించుకుంది సుమతి.

"అవును సుమతీ... ఈమధ్య ముష్టివాళ్లు తెలివిమీరిపోయారు. రకరకాల వేషాలు వేసి అందినంత దోచుకుపోతున్నారు..." ఆమె అభిప్రాయాన్ని బలపరిచింది సుజాత.

ఇంతలో ఆమె మా ఇంటిముందు నిలబడి ఆకలి కేకలు పెట్టసాగింది.

మా ప్రక్కనే కూర్చుని ఉన్న సంగీత ఒక్క ఉదుటున గేటు దగ్గరకు వెళ్లి "ఏయ్! ఏంటా అరవడం... ముందిక్కడ నుంచి ఫో..."అంటూ ఆగ్రహంగా కేకవేసింది. ఆమె కళ్లల్లో అంతులేని కంపరం నిండి ఉంది.

ఆ బిచ్చగత్తె కుర్రాడికి తొడిగిన పీలికలైన షర్టును ఎత్తి, అంటుకు పోయిన వాడి కడుపును చూపిస్తూ "సూడు తల్లీ... రెండ్రోజులై బువ్వనేక బిడ్డడి పొట్టెట్టా ఎండిపోనాదో సూడు. దయుంచి ఓ రూపాయి డబ్బులిప్పిస్తే..." అంది దయనీయంగా.

"రూపాయి లేదు. పాపాయి లేదు. మమ్మల్ని మోసంచేయడానికి ఇదొక రకం యాక్షన్. వెళ్లెళ్లు... డర్టీ ఉమెన్..." చీదరించుకుంటూనే తిట్లు లంకించుకుంది సంగీత.

అయినా ఆమె తన పట్టు విడవలేదు. పైసో, పరకో దానం చేయమని కాళ్లవేళ్ల పడి బతిమాలుతూనే ఉంది.

సంగీత గంగవెర్రులెత్తిపోయి దాన్ని మా ఇల్లు విడిచి వెళ్లేవరకూ తరిమితరిమి కొట్టింది.

సుజాత, సుమతి చోద్యం చూస్తున్నారే గాని కలుగజేసుకోలేదు.

ఆమె జాలిగా చూస్తూ, నిష్క్రమించుతూ ఉండగా "ఏయ్ అమ్మీ ఆగు..."అంటూ పిలిచాడు నితీష్.

వాడి చేతిలో ఉన్న విస్తరాకులో ప్రొద్దున్న మిగిలిపోయిన నాలుగు ఇడ్లీలు, ఇంత పచ్చడి ఉన్నాయి.

బిచ్చగత్తె కళ్లు విప్పారాయి. ఆత్రంగా దగ్గరకు రాగానే ఆమె చేతిలో ఆ ఆకు నుంచి, జేబులోంచి పది రూపాయల నోటు తీసిస్తూ "పిల్లాడికి ఏదన్నా పెట్టించు..." అన్నాడు నితీష్ కరుణ నిండిన స్వరంతో.

ఆమె ముఖం చింకి చేటంత చేసుకొని "ధరమ పెబువ్వి... నాలుగు కాలాలపాటు సల్లగా ఉండు..." కృతజ్ఞత నిండిన స్వరంతో దీవించింది.

"ఏంటి బావా నువ్వు! నేను వద్దంటే నువ్వు ఇస్తావా! అక్కడికి నువ్వేదో కర్ణుడికి కజిన్ బ్రదర్ అయినట్లూ. ఇలా...అడుక్కొనే వాళ్లని ఎంకరేజ్ చేయడంవలనే ఇండియా ఇలా వెనుకబడిపోతోంది." వాడిమీద అధార్టీ చలాయిస్తూ అంది సంగీత.

నితీష్ ఆమెవైపు తీవ్రంగా చూసి లోపలికి వెళ్లిపోయాడు.

"వాడి హృదయం చాలా మెత్తన సుమతీ. ఎవరు ఏ కష్టంలో ఉన్నా కరిగిపోతాడు. వాడికి చేతనైన సాయం చేయకుండా ఉండలేడు." కొడుకు గుణగణాల్ని స్తుతించసాగింది సుజాత.

"అన్నివేళలా ఆ దయ పనికిరాదు వదినా. ఈరోజుల్లో ఘరానా మోసాలు ఎక్కువైపోయాయి... కొడుక్కి కాలేజి ఫీజు కట్టాలనో, కూతురికి పురుడు పోయాలనో సాకులు చెప్పి అడుక్కునే వారు కోకొల్లలు. ఇలాంటివాళ్లు కూడా వారికి ఏమాత్రం తీసిపోరు. అయినా నా కూతురు సామాన్యురాలు కాదు. ఆవులిస్తే పేగులు లెఖ్ఖపెట్టే రకం. పెళ్లయ్యాక ఇలాంటి దాన ధర్మాలకు అదే అంటకత్తెర వేస్తుంది." మురిపెంగా చెప్పింది సుమతి అదొక పెద్ద క్వాలిఫికేషన్ అన్నట్లుగా.

ఆనాటి ఆ సంఘటన కళ్లముందు కదలాడగానే, అర్థమైంది... నితీష్ ఆ కారణాన్ని ఎందుకు వెల్లడించాడో.

సుజాత మాత్రం మేనకోడల్ని వెనకేసుకొచ్చింది.

"ఏమో! నిజంగా వాడు దాని బిడ్డేనన్న గ్యారంటీ ఏమిటి? ఆ పిల్లాడిని అద్దెకే తీసుకొచ్చిందో, లేక ఎక్కడి నుంచైనా ఎత్తుకొచ్చిందో..." అంటూ సంగీత ప్రవర్తనను సమర్థించింది.

తల్లి విశ్లేషణ నితీష్‌కి అంత నచ్చినట్లుగా లేదు-

"కావచ్చు. ఆమె చెప్పినది అబద్ధమే కావచ్చు. కాని, వాడు ఆకలితో ఉన్న మాట వాస్తవం. ఎండిపోయిన వాడి కడుపును చూస్తేనే ఆ విషయం గ్రహించవచ్చు. ఏ రూపాయో దానం చేసినంత మాత్రాన మన ఆస్తులేమీ తరిగిపోతాయా? డబ్బులివ్వడం ఇష్టంలేకపోతే ఇన్ని పాలచుక్కలో, పిడికెడన్నమో పెట్టచ్చు కదా!" ప్రశ్నించాడు కాస్త కోపంగా.

ఇంటి వైద్యం
★ అర్జున పట్ట మరియు మంజిష్టాలను మెత్తగా నూరి తేనె మరియు వెన్న కలిపి ముఖంపై రాసిన నల్ల మచ్చలు తగ్గుతాయి. లేదా అర్జున పట్టను మేక పాలతో నూరి ఉదయం సాయంత్రం రాసిన నల్ల మచ్చలు తగ్గుతాయి.

సుజాత వెనక్కి తగ్గుతూ "ఏమోరా! సంగీతకు ముష్టి వాళ్లకు ధర్మం చేయడం ఇష్టముండకపోవచ్చును" అంత మాత్రాన ఆమెకు మానవత్వం లేనట్లేనా!" అంది.

"ఓ.కే... అమ్మా! నీ మాటే కరెక్టనుకుందాం. బిచ్చం వేయడం ఆమెకు ఇష్టం లేదనే అనుకుందాం. ఆమాట నెమ్మదిగా చెప్పొచ్చు. లేకపోతే మౌనంగా ఉండిపోవచ్చు. అంతే కాని, పెద్ద గొంతేసుకొని, వెంటపడి తరమడమెందుకు?" అన్నాడు నితీష్.

వారిద్దరి వివాదంలో నేను మౌన ప్రేక్షకుడిలా మిగిలాను.

"బాగుంది నీ వివరణ! ఈమాటే మామయ్యతో చెప్పమన్నావా!" ఆగ్రహం వెళ్లగ్రక్కింది సుజాత.

"తప్పకుండా చెప్పు. గుండెలో తడిలేని అమ్మాయిని జీవితాంతం భార్యగా భరించలేనన్నానని కూడా చెప్పు" తన నిర్ణయాన్ని సుస్పష్టంగా వినిపించాడు నితీష్.

"ఒక్క సంఘటననుబట్టి ఆమె మనస్తత్వాన్ని నువ్వెలా నిర్ధారించగలవు?"

ఎలాగైనా కొడుకుని ఒప్పించాలన్న తాపత్రయంతో అంది సుజాత.

"అన్నం ఉడికిందో లేదో చూడడానికి ఒక్క మెతుకు పట్టుకు చూస్తే చాలమ్మా".

వాడు అన్వయించినది పాత సామెతే అయినా, ఆ సందర్భాన్ని అతికినట్లుగా సరిపోయిందని అనిపించింది. వాడిని కన్న తండ్రిగా, వాడిలోని సేహభావానికి ముగ్ధుడనయ్యాను.

ఇంకా శాంతించని సుజాత "ఇదే నీ ఆఖరు మాటా!" పంతంగా రెట్టించింది.

"మొదలు, ఆఖరు లేదమ్మా. నాది ఒకటే మాట. హృదయంలో పిసరంతైనా ఆర్ద్రత లేని అమ్మాయి నాకవసరం లేదు." నిక్కచ్చిగా చెప్పేసి బయటకెళ్లిపోయాడు నితీష్.

"ఇప్పుడు నేను మా అన్నయ్యకి ముఖం ఎలా చూపను!" వాపోయింది సుజాత.

"తప్పదు. వాడికిష్టం లేని పెళ్లిచేసి వాడి బ్రతుకు నరకం చేయలేము" అన్నాను.

❁ ❁ ❁

ఆ తరువాత నాలుగు నెలలకి సంగీతకు పెళ్లయిపోయింది. మేనకోడల్ని తన కడుపులో పెట్టుకుని కాపాడుతానని హామీఇచ్చి మరీ తన ఇంటి కోడల్ని చేసుకుంది మా వదినగారు తన ఔదార్యాన్ని చాటుకుంటూ.

ఆ త్యాగం వెనుక ఆరు లకారాల క్యాషూ, ఆరు తులాల బంగారం దాగున్నాయని లోపాయకారీగా తెలిసింది నాకు.

ఎలా అయితేనేం! సంగీత ఓ ఇంటిదైంది. పెళ్లి చాలా ఘనంగా చేశారు.

"ముద్దు-ముచ్చట పొందే అదృష్టం మనవాడికి లేదు..." తల్లడిల్లింది సుజాత.

భారీఎత్తున కట్నకానుకలు స్వీకరించే సదవకాశం చేజారిపోయిందన్న బాధ ఆమె చేత అలా పలికించింది.

కాలప్రవాహం మరి నాలుగేళ్లను తనతో కలిపి లాక్కుపోయింది. ఈలోపు మా జీవితాల్లో పెనుమార్పులే జరిగాయి.

నితీష్ తనతోపాటే పనిచేస్తున్న 'సౌమ్య'అనే అమ్మాయిని లవ్‌చేసి పెళ్లిచేసుకున్నాడు. ఆ పెళ్లికి మా దంపతులం అభ్యంతరం లేవదీశాం. కారణం... సౌమ్యది మా కులం కాదు.

కాని నితీష్ మా మాటను ఖాతరు చేయలేదు. తనకు కులం ప్రధానం కాదు. గుణమే ముఖ్యమనీ, సౌమ్యలో ఉన్న సహృదయత, కారుణ్యం తనను ఆకట్టుకున్నాయనీ, అందుకే ఆమె చేయి అందుకున్నాననీ తెగేసి చెప్పాడు.

తరతరాలు మా నరనరాల్లో జీర్ణించుకున్న సనాతన భావాలు, మేం వాడితో విభేదించేందుకు తోడ్పడ్డాయి.

ఫలితం... వాడు హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మాకు దూరంగా వెళ్లిపోయాడు.

ఈ నాలుగేళ్లుగా మామధ్య ఉత్తర-ప్రత్యుత్తరాలకి చోటులేదు. రాకపోకలకి తావులేదు. వాడి క్షేమ సమాచారాలు కనుక్కునేందుకు మేం మొగ్గు చూపలేదు.

అయితే... మనసులో ఏ మూలో, వాడి సంసారం చూసి ఆనందించాలన్న కోరిక ఉండేది. కాని ... వాడు మా



**నితీష్ అంచనా తప్పలేదు. అయితే... వాడు ఏరి-కోరి చేపట్టిన సౌమ్య వాడి అంచనాలకి సరిపడా ఉందో లేదో తెలుసుకోవాలన్న కుతూహలం కుదిపేసింది నన్ను.**

**ఇన్నాళ్లుగా దూరంగా నెట్టేసిన వాడి దగ్గరకు ఏ మిష పెట్టుకొని వెళ్లాలో అర్థంకావడంలేదు.**

మాటకు ఇసుమంతైనా విలువ ఇవ్వక, తన మాట నెగ్గించుకున్నాడన్న కోపం, ఆ కోరికను గుండె పొరల మాటున అదిమి పెట్టింది.

సంగీతను చేసుకోనన్నాడని వాడిమీద కినుక కలిగినా, వాడి నిర్ణయం సబబైనదేనని మాకీమధ్యే రుజువైంది.

ఈ గెలుపు బొత్తిగా లేని సంగీతను కోడలిగా తెచ్చుకొని, తామెంత యాతన పడుతున్నామో, మా వదినగారు సోదాహరణంగా వివరించాక, ఆ బాధనుండి మమ్మల్ని రక్షించినందుకు నితీష్ మీద మాకు అభిమానం పొంగుకొచ్చింది.

ఎంగిలి చేత్తో కాకిని కొట్టదనీ, ఇంటికి అతిథి - అభ్యాగతి వస్తే ఆదరించకపోగా అవమానించి పంపుతుందనీ, ఆమె గయ్యాళితనాన్ని భరించలేక ఏ పనిమనిషీ కూడా నెలరోజులకి మించి పనిచేయడం లేదనీ... ఎన్నో... సుజాతతో చెప్పుకొని గోల పెట్టింది ఆవిడ.

నితీష్ అంచనా తప్పలేదు. అయితే... వాడు ఏరి-కోరి చేపట్టిన సౌమ్య వాడి అంచనాలకి సరిపడా ఉందో లేదో తెలుసుకోవాలన్న కుతూహలం కుదిపేసింది నన్ను.

ఇన్నాళ్లుగా దూరంగా నెట్టేసిన వాడి దగ్గరకు ఏ మిష పెట్టుకొని వెళ్లాలో అర్థంకావడంలేదు.

కాదని కాలదన్నుకున్నాక, ఇప్పుడు తగుదునమ్మా అంటూ ముఖం చూపించడానికి ఆత్మాభిమానం అడ్డువచ్చింది.

కాని... అది ఎన్నాళ్లో నిలవలేదు.

ఈమధ్య... నా ప్రాణస్నేహితుడు ఏకాంబరం ఏదో పని మీద హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ... మా నితీష్ కనబడి ఎంతో ప్రేమగా పలకరించి వాళ్లింటికి తీసుకెళ్లాడుట. ఎంతో ఆప్యాయంగా అతిథి మర్యాదలవీ చేశాడుట.

"ఏమో అనుకున్నాను గాని, మీ అబ్బాయి మంచి మర్యాద తెలిసిన వాడేనోయ్... ఇక మీ కోడలు సరేసరి. మహాలక్ష్మిలా కళ-కళ లాడిపోతోందనుకో. అన్నపూర్ణలా కొసరి- కొసరి వడ్డించింది. పిల్లాడు పుట్టాక, వాడిని చూసుకునేందుకు టైమ్ చాలడంలేదని ఉద్యోగం మానేసిందట. మొత్తానికి భర్తకి తగిన భార్య.

ఇక మీ మనవడున్నాడూ... సిమ్లా యాపిల్‌లా ముద్దుగా- బొద్దుగా ఉన్నాడు. ఆ బుడతడి చిలక పలుకులు వింటూంటే మది పులకరించి పోయిందంటే నమ్ము..." అంటూ మావాడి సంసార విశేషాలన్నీ వర్ణించి నన్ను ఊదరగొట్టి పారేశాడు ఏకాంబరం.

"అవన్నీ తరువాత... ఇంతకీ వాడు మమ్మల్ని తలచాడా! లేదా!" అడగకూడదనుకుంటూనే అడిగాను.

"నేనున్నంతసేపూ కూడా నితీష్‌కి మీ గురించే తలంపు. మీకు దూరమైనందుకు అతడెంతగానో కుమిలిపోతున్నాడు... ఈ పంతాలు- పట్టింపుల వలన మనకు ఒరిగేదేంటి చెప్పు!... మనసులు కలత చెందడం తప్ప. నామాట విని వెళ్లి వాళ్లనోసారి చూసిరండి..." ఏకబిగిన హితబోధ చేశాడు ఏకాంబరం.

వాడు ఆ మాట చెప్పిన దగ్గర్నుండీ సుజాత తన కొడుకును చూసుకోవాలని తపించిపోసాగింది. నాకూ మనవడి ముద్దుమాటలు చెవులారా విని ఆనందించాలని ఉన్నా... కోరి వెళ్తే లోకువైపోతామన్న భయం కలిగింది.

అదంతా నా అపోహనీ, నితీష్ ఎన్నటికీ అలాచేయడనీ నచ్చచెప్పింది.

"ఆ అన్నట్లు ఈమధ్య మీ వాడికి ప్రమోషన్ వచ్చిందటోయ్. ఆఫీసర్ అయ్యాడుట. సంపాదనకు తగినట్టుగానే దానధర్మాలు కూడా విరివిగా చేస్తాడుట. [illegible] తన ఇంటికి ఎవరు వచ్చినాసరే వాళ్లని ఒట్టి చేతులతో పంపడట..." ఏకాంబరం చెప్పిన ఈ విషయం కూడా మదిలో మెదిలింది.

ఎందుకో... మావాడు కోరుకున్న విధంగా, సౌమ్య వాడికి సహకరిస్తుందో లేదో పరీక్షించాలన్న కోరిక పుట్టింది మనసులో.

నా ఆలోచన విన్న సుజాత "మీరు ఎటువంటి పిచ్చిపనులూ చేయద్దు బాబూ! ఇన్నేళ్లుగా నా కొడుక్కి దూరంగా ఉన్నాను. ఇప్పుడీ రకమైన ప్రయోగాలు చేసి వాడిని నాకాకుండా చేయకండి..."అంటూ చీవాట్లు పెట్టింది.

కేవలం నాలోని కుతూహలం అణచుకోలేకే ఆమెను పరీక్షించ సంకల్పించానే తప్ప, నా మనసులో వేరే దురుద్దేశ్యమేదీ లేదనీ, సౌమ్య ఎటువంటి మనస్తత్వం కలిగినదైనా సరే... మనస్ఫూర్తిగా ఆమెను నా కోడలిగా స్వీకరిస్తాననీ చేతిలో చేయివేసి ప్రమాణంచేశాక గానీ శాంతించలేదు శ్రీమతి.

అనుకున్నదే తడవుగా హైదరాబాద్ బయలుదేరాం ఇద్దరం.

ఆమెను తెలిసిన వాళ్లింట్లో ఉంచి నా నాటకానికి శ్రీకారం చుట్టాను.

❁ ❁ ❁

ఆ ఇంటిముందు ఆగి, నా చేతిలో ఉన్న కాగితం ముక్క మీద రాసున్న అడ్రస్‌లోని డోర్ నంబర్‌తో, ఆ ఇంటి నంబర్‌ని సరిపోల్చుకున్నాను.

నేను వచ్చినది సరైనచోటుకే అని నిర్ధారించుకొని కాలింగ్‌బెల్ మ్రోగించాను.

కాస్సేపటి తరువాత తలుపు తెరుచుకుంది.

చామనఛాయకి ఒక మెట్టు పైనుండే దేహచ్ఛాయతో, ముఖమంతా పసుపురాసుకుని లక్ష్మీదేవిలా సాక్షాత్కరించింది ఓ అమ్మాయి.

ఇంటి వైద్యం

★ గారపండు (ఇంగువ)లోని గుజ్జును చల్లని నీటితో రాసిన మచ్చలు తొలుగును.

★ శాల్మలీ (బూరుగ) ముళ్లను మెత్తగా నూరి రాసిన నల్లటి మచ్చలు తగ్గుతాయి.

ఆమె ప్రక్కనే... మూతి నిండా అంటుకున్న పెరుగు బువ్వతో, అచ్చం వెన్న దొంగిలించి తింటున్న బాలకృష్ణుడిలా ఉన్నాడు ఓ పసివాడు.

"ఎవరు కావాలండీ?" మృదువుగా అడిగింది నన్ను.

"నితీష్ గారిల్లు..." అర్థోక్తిలో ఆపేశాను.

"అవునండీ... ఇంతకీ మీరూ..." సంశయంగా ప్రశ్నించిందామె.

"నా పేరు సుందరశాస్త్రి అమ్మా. మీవారి దగ్గరకు చిన్న కార్యార్థినై వచ్చాను... వినయంగా చెప్పాను.

"అలాగా... ఒక్క క్షణం... ఇప్పుడే వస్తాను..." అంటూ పిల్లాడిని తీసుకొని లోపలికెళ్ళిపోయింది ఆమె.

ఒక పది నిమిషాల తరువాత వచ్చి తలుపు తీసి నన్ను లోపలికి ఆహ్వానించి, కూర్చోమని కుర్చీ చూపింది. త్రాగడానికి మజ్జిగ తెచ్చిచ్చింది.

నేను కాస్త స్థిమిత పడ్డాక "ఇప్పుడు చెప్పండి. మా వారితో ఏం పని మీకు?" అని అడిగింది.

నా సంకోచం గమనించి "ఆయన ఇంట్లో లేరు. మీకభ్యంతరం లేకపోతే మీరొచ్చినది ఎందుకో నాతో చెప్తే. నేను ఆయనకి చెప్తాను" అంటూ అభయమిచ్చింది.

"మాది పేరాపురం అగ్రహారమమ్మా. నా కూతురికి పెళ్ళి తలపెట్టాను. నా దగ్గర పెళ్లి ఖర్చులకి సరిపడినంత డబ్బు లేదు... మీలాంటి సహృదయులు సాయపడితే. అట్లైతే నా కూతురిని ఒకింటిదాన్ని చేయాలని. ఇలా వచ్చాను. నితీష్ గారు చాలా మంచి వారనీ. నాలాంటి పేదవారిని ఆదుకునే విశాల హృదయులనీ తెలిసి మీ ముందు చేయి చాపుతున్నాను... గద్గదంగా అంటూ బ్యాగ్ తెరిచి ముందు జాగ్రత్తగా నేను ప్రింట్ చేయించిన దొంగ శుభలేఖను చూపించాను.

సౌమ్య నా మాటలు నమ్మదన్న సందేహమే నాక్కలగ లేదు. పేదరికం ఉట్టిపడేలా నేను ధరించిన పాత పంచెను, నట విశ్వరూపం చూపిస్తూ. నా వదనంలో ప్రస్ఫుటింపజేస్తున్న దైన్యాన్ని చూసి ఆమె నా మాటలను నమ్మితీరుతుందని నాకు తెలుసు. పైగా శుభలేఖ సాక్ష్యం ఉండనే ఉంది.

నేను ఇలా ఆలోచిస్తుండగానే "అమ్మా.. ఎవల్లూ..." అంటూ బుడిబుడి అడుగులు వేస్తూ వచ్చి, తల్లి చీరకుచ్చిళ్ళ చాటునుండి వింతగా చూడసాగాడు నా మనవడు.

వాడి తల నిమురుతూ "తాతగారవుతారమ్మా!" చెప్పింది సౌమ్య.

గతుక్కుమన్నాను. నా ఉలికిపాటు గమనించినట్లుగా-

"వయసులో పెద్దవారు కదాని అలా చెప్పాను..." అంది సౌమ్య నవ్వుతూ.

చక్రాల్లాంటి వాడి కళ్లు, పాలుగారే వాడి చెక్కిళ్లు చూసి నాలోని మమకారం వరదలా పొంగుకొచ్చింది. కాని... అత్యుత్సాహం ప్రదర్శించి వాడిని అక్కున చేర్చుకుంటే నా నాటకం బయటపడిపోయే ప్రమాదం ఉందన్న భయంతో, దూరంనుండే వాడిని "ఛీ... ఛీ" అని ముద్దులాడాను.

"మీరు శ్రమనుకోకుండా రేపుదయం రండి. ఆయన ఇంట్లోనే ఉంటారు. ఈలోపు ఆయనతో నేను మాట్లాడతాను..." చెప్పింది సౌమ్య.

అలాగేనని చెప్పి, మనవడి రూపాన్ని కన్నుల నిండా నింపుకొని వదల్లేక వదల్లేక బయటికి అడుగుపెట్టాను.

మనసు మాత్రం సౌమ్య ప్రవర్తననే విశ్లేషిస్తోంది. మావాడు కోరుకున్న సుగుణాలన్నీ మూర్తీభవించినట్లుగా కనిపిస్తోంది. దాతృత్వం ఉన్న మనిషిలాగే అనిపిస్తోంది. మా వాడు రేపు ఏం సమాధానం చెప్తుందో... దాన్నిబట్టే ఆమె వ్యక్తిత్వం తేటతెల్లమౌతుంది.

ఆ రాత్రి సుజాతతో మనవడి ముచ్చట్లన్నీ పదే- పదే చెప్పుకుని మురిసిపోయాను.

మర్నాడుదయం, కావాలనే... నితీష్ ఆఫీస్‌కి వెళ్లే సమయం దాటిపోయాక మళ్లీ వెళ్లానక్కడికి...యథాప్రకారం మర్యాద చేసింది సౌమ్య.

"అమ్మా... అబ్బాయి ఏమన్నాడు... ఈ బడుగు బాపడికి ఏమన్నా..." నసిగాను.

సౌమ్య ముఖం నిండా శాంతి పరుచుకుంది. వెన్నెల కిరణంలాంటి పలుచని నవ్వు ఆమె వదనానికి నిండుతనం తెచ్చింది. "ఇప్పటివరకు మీకోసం వెయిట్ చేసి వెళ్లారండీ. మీ సంగతి ఆయనతో చెప్పాను... ఆయన సరేనన్నారు. పెళ్లికూతురికి అవసరమైన పట్టుచీర, మట్టె మంగళ సూత్రం వగైరాలన్నీ ఆయనే ఏర్పాటుచేస్తానని మీతో చెప్పమన్నారు" అంది.

నా హృదయం తేలిక పడింది. నితీష్ భావించినట్లుగా ఆమె మానవత్వం ఉన్న మనిషేనని రుజువైంది. అంతలోనే జాలి కలిగింది.

ఈమె ఇంత అమాయకురాలా! పరిచయం లేని వ్యక్తి నాలుగు మాయమాటలు చెప్తే నమ్మేసి. ఇంత మొత్తంలో సహాయం చేయడానికి సిద్ధపడుతూంటే ఏమనుకోవాలి! ఇంత అతి మంచితనమూ ప్రమాదమే.

ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా వ్యవహరించమని నా కొడుకును హెచ్చరించాలి.

పాత్రత కలిగిన వారికే దానం చేయమంటారు పెద్దలు. నేను చెప్పినది నిజమో, అబద్ధమో నిర్ధారించుకోకుండా ఆమె నాకు సహాయపడాలన్న నిర్ణయానికి రావడాన్ని నా హృదయం అంగీకరించలేకపోతోంది.

నా భావాలు బయటపడకుండా మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తూ "ఆయన మంచితనానికి నా జోహార్లమ్మా. జన్మలో మీ మేలు మరచిపోలేను. మీ దంపతుల పేరు చెప్పుకొని మా ఇంట్లో దీపం పెట్టుకుంటాను. దయచేసి... మీరిప్పిస్తానన్న మొత్తం ఇప్పిస్తే..." అన్నాను మెల్లగా.

"క్షమించండి... పెద్దవారు. మిమ్మల్ని నేను సందేహించడం తగదు... అలాగని మీ మాటలను పూర్తిగా విశ్వసించలేను. అందుచేత..." ఆగిపోయింది సౌమ్య ఏం చెప్పాలో తోచనట్లుగా చేతుల నులుముకుంటూ.

"అ...మ్మా..." విఘాతం కలిగిన వాడిలా బాధ నటిస్తూ" చూడబోతే... మీరు నేను చెప్పింది నమ్మినట్లు లేదు. పెళ్లి శుభలేఖ కూడా చూపించాను కదమ్మా. నేను కూటికి పేదగాని... కులానికి పేద కాదు" అన్నాను కాస్త రోషంగా.

సౌమ్య నొచ్చుకున్నట్లుగా ఆమె ముఖ కవళికలు మారాయి.

"అయ్యయ్యో! నేను మీ నిజాయితీని శంకించడం లేదు. కాని మేం చేసిన సహాయం సార్థకమైందోలేదోనన్న ఆతృత మాకూ ఉంటుంది కదా! అందుకే అలా అన్నాను. అయినా పెళ్లి ఎటూ ఇక్కడే జరిపిస్తామని చెప్పారు కాబట్టి, ముహూర్త సమయానికి నేను, మావారు వచ్చి వాటిని అందిస్తాం. మా చేతులతో మేమే అందిస్తే అదొక తృప్తి. కాదంటారా!" చెప్పింది ఎంతో వినమ్రంగా.

ఏమంటాను! నొప్పింపక, తానొవ్వక ఎంతో విజ్ఞతతో కూడిన ఆ సమాధానం నాకు సంతృప్తినిచ్చింది.

నితీష్ కోరుకున్న విధంగా ఆమె గుండెల్లో తడి ఉన్న మనిషే కాదు, వాడికి అర్ధాంగి కావలసిన అర్హతలన్నీ కలిగి ఉన్న స్త్రీమూర్తని తెలుసుకున్నాక నా గుండెల మీద నుండి ఏదో భారం దింపినట్లయ్యింది.

వాడి ఎంపిక సరియైనదన్న నమ్మకం కలిగాక, సంతోషంతో నా మనసు నిండిపోయింది.


వెంటనే కూర్చున్న చోటునుండి లేస్తూ "సరేనమ్మా... మీ ఇష్టం... నేను మళ్లీ కలుస్తాను"అంటూ బయలుదేరాను.


ఇప్పుడు నా మనసులో ఒకటే ఆరాటం... త్వరగా వెళ్లి సుజాతను నాకూడా తీసుకొచ్చి, మేం తన అత్తమామలమన్న విషయం... కాదు కాదు ఆమె మా ప్రియమైన కోడలు పిల్లన్న సంగతి సగర్వంగా చెప్పుకొని. నా వంశాంకురంతో ఆటలు ఆడుకోవాలన్న తపనతో నా అడుగుల గబగబ ముందుకు సాగాయి. ★


రచయిత చిరునామా

కె.కె.భాగ్యశ్రీ

రామతీర్థం (పోస్ట్),విజయనగరం జిల్లా- 535 218




ఇంటి వైద్యం

★ మంజిష్టా, రక్త చందనము, కుష్ఠు(చెంగల్వా కోష్ఠు), పచ్చి పసుపు కొమ్ములు, మఱ్ఱి చిగుళ్లు, చిరు శనగలను సమంగా కలిపి మెత్తగా నూరి రాసిన మచ్చలు తొలగుతాయి.